# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 05-12-2024 సంపుటి : 06 సంచిక : 65 పేజీలు : 8 వెల : రూ


## తిరుమలలో ఇన్‌స్టాగ్రామ్ రీల్‌పై నెటిజన్ల ఫైర్

తిరుమల, డిసెంబర్ 4): తిరుమలకు వెళ్లే దారిలో అలిపిరి గేటు వద్ద ఓ యువతి చేసిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ ఇప్పుడు భక్తులకు ఆగ్రహం తెప్పిస్తోంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న పుష్ప 2 సినిమాలోని కిస్సిక్ పాటకు ఓ యువతి అదిరిపోయే స్టెప్పులు వేస్తూ వీడియో చేసింది. ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. సదరు యువతి ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆ రీల్ వెంటనే వైరల్‌గా మారింది. కానీ అది కాస్త భక్తులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. వ్యూస్ కోసం శ్రీవారి సన్నిధిని కూడా వదలడం లేదని భక్తులు మండిపడుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యూస్ కోసం ఇలా తిరుమలలో పిచ్చి పిచ్చి వీడియోలు, ఫ్రాంక్‌లు చేయడం ఎక్కువైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తమిళనాడుకు చెందిన ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ శ్రీవారి క్యూలైన్లలో ఫ్రాంక్ వీడియో చేశాడు.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం

స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము

ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787


# తెలుగు రాష్ట్రాల్లో భూకంపం

## ఇళ్ల నుంచి పరుగులు పెట్టిన ప్రజలు



హైదరాబాద్/విజయవాడ,తెలుగు రాష్ట్రాల్లో భూకంపం ప్రకంపనలు సృష్టించింది. విజయవాడలో పలు సెకన్లపాటు భూమి కంపించింది. భయంతో ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీశారు. జగ్గయ్యపేట, పరిసర గ్రామాల్లో సైతం భూమి కంపించింది.ప్రకంపనలు సృష్టించింది. ఎన్టీఆర్ జిల్లాలో భూకంపం ప్రజలను భయాందోళనలకు గురి చేసింది. విజయవాడలో పలు సెకన్లపాటు భూమి కంపించింది. జగ్గయ్యపేట, పరిసర గ్రామాల్లో సైతం భూమి కంపించింది. దీంతో ఇళ్లు, అపార్ట్మెంట్ల నుంచి ప్రజలు ప్రాణ భయంతో బయటకు పరుగులు పెట్టారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా భూకంపం వచ్చింది. కొన్ని చోట్ల నిమిషం పాటు స్వల్పంగా భూమి కంపించింది. వరంగల్ నగరం సహా అన్ని ప్రాంతాల్లో భూకంపం రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థం భయంతో గందరగోళానికి గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్ల నుంచి బయటకు వచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోనూ మూడు సెకన్లపాటు భూమి కంపించింది. బుధవారం ఉదయం 7:27 గంటలకు ఒక్కసారిగా భూకంపం రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అలాగే మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఐదు సెకన్లపాటు భూమి కంపించింది. ఉదయం 7:28 నిమిషాలకు భూ ప్రకంపనలు వచ్చాయి. మహబూబాబాద్ జిల్లా గంగారంలో భూమి తీవ్రంగా కంపించింది. భూకంపం దెబ్బకు కుర్చీలో కూర్చున ప్రజలు సైతం కిందపడిపోయారు. దీంతో అంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కరీంనగర్ విద్యానగర్లోనూ భూమి కంపించింది. నిలబడిన వారు సైతం ఒక్కసారిగా పక్కకు ఒరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, సుల్తానాబాద్, కరీంనగర్, హుజురాబాద్లో సైతం స్వల్పంగా భూకంపం వచ్చింది. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో ఐదు సెకండ్ ల పాటు భూమి ఊగింది. ఇంట్లో ఉన్న సామాన్లు బీరువాలు బిల్డింగులు ఊగడం భూమి ఊగినట్టుగా ఆనవాళ్లు కనిపించాయి.

# ఏపీలో ఉచిత విద్యుత్‌పై మంత్రి కీలక ప్రకటన

విజయవాడ ,అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అల్పాదాయ కుటుంబాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్ కు సంబంధించి మంత్రి గొట్టిపాటి బుధవారం వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. 15,17,298 ఎస్సీ కుటుంబాలు, 4,75,557 ఎస్టీ కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారని మంత్రి స్పష్టం చేశారు. మొత్తం 19,92,855 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ ను



అందించే క్రమంలో కూటమి ప్రభుత్వం నెలకు సుమారు రూ.477.30 కోట్లు వినియోగిస్తున్నట్లు మంత్రి ప్రకటనలో వెల్లడించారు.ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఖండించారు. అల్పాదాయ వర్గాలకు ఎంతో ఉపయుక్తంగా అమలవుతున్న ఉచిత విద్యుత్ పథకానికి అడ్డంకులు సృష్టించేందుకే? కొందరు లేనిపోని అసత్యాలను, అపోహలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం దళిత, గిరిజనుల కోసం అమలు చేస్తోన్న పలు పథకాలు, సూపర్ సిక్స్ వంటి వాటిని చూసి పూర్తి నిరాశలో మునిగి పోయిన వైసీపీ? తన నీలి మీడియాను అడ్డం పెట్టుకుని అడ్డగోలు రాతలు రాయిస్తుందని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్ వినియోగానికి 200 యూనిట్లు కటాఫ్ గా ఈ పథకం ఎంతో కాలంగా అమలు అవుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. దళిత, గిరిజనులకు ఉచిత విద్యుత్ పథకాన్ని మొదటిసారి అమలు చేసిందే తెలుగుదేశం పార్టీయే అని ఆయన తెలిపారు. 200 యూనిట్ల లోపు వచ్చిన అందరూ పథకానికి అర్హులే అని స్పష్టం చేశారు. పథకం అమలు విధివిధానాలకు సంబంధించి?. లబ్ధిదారుల్లో ఎవరికైనా అనుమానాలు ఉంటే.. 1912కు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. విద్యుత్ రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టినా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

## పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా

### సాంకేతిక లోపం తలెత్తడంతో నిర్ణయం



శ్రీహరికోట,డిసెంబర్ 4 : పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా పడింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇవాళ నింగికి ఎగరాల్సిన ప్రోబా3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 నిమిషాలకు ప్రయోగం ఉంటుందని ఇస్రో చెప్పింది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను ఇస్రో నింగిలోకి పంపుతున్నది. నిజానికి ఇవాళ సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.

## బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

విభారె న్యూస్:: ఆళ్లగడ్డ:: బాంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా హిందూ ఐక్య వేదిక అధ్వర్యంలో నేడు ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహించారు. హిందువులపై దాడులు ఆపాలని, హిందువుల రక్షణ కై ఆ దేశ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలనీ , కరోనా కష్టకాలంలో బంగ్లా జాతియులను ఆధుకున్న ఇస్కాన్ సంస్థ ప్రతినిధి చిన్మోయ్ కృష్ణ దాస్ అరెస్టు దుర్మార్గమని ఆయనను వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. హిందూవుల ఐక్యతే దేశానికి,ధర్మానికి హిందువులకు క్షేమమని వక్తలు తెలిపారు . ఈ కార్యక్రమములో న్యాయవాదులు నీలకంతేశ్వరం , బోరెడ్డి లక్ష్మి రెడ్డి , ఆవుల విజయ భాస్కర్ రెడ్డి నిత్య తృప్తదాస్ , మోహన్ రెడ్డి,కేశవ దాస్ తదితరులు పాలగొన్నారు.




# శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అనాథప్రేత సంస్కరణలు..




శ్రీశైల మహాక్షేత్రంలో శివైక్యం పొందిన వారి అంత్యక్రియలను గౌరవప్రదంగా నిర్వహించేందుకు అవసరమైన కైలాస రథాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిధిలో దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందితో పాటు స్థానికులు, భక్తులు మరణించిన సందర్భాల్లో పార్థివ దేహాన్ని శానిటేషన్ ట్రాక్టర్లలో తీసుకువెళ్లడం బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి.. కైలాస రథం ఏర్పాటుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు.అప్పటి వరకు నూతనంగా ఓ ట్రాక్టర్ వాహనాన్ని ఏర్పాటు చేసి అంతిమయాత్రలకు అనుమతించాలని సూచించారు. అదే విధంగా క్షేత్ర పరిధిలో మరణించిన వారిని ఖననం చేయడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయని, పూడ్చడంతో పాటు సమాధులు నిర్మాణాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. కాశీ మహాక్షేత్రంలో కూడా మృతదేహాలను కేవలం ఖననం చేస్తున్నారని.. అదే విధంగా పలు అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీ ప్రాంతాల్లో కూడా పూడ్చడం వంటి సాంప్రదాయాన్ని నిలిపివేస్తున్నారన్నారు. మృతదేహాలను పూడ్చి సమాధులు నిర్మించదలచిన వారు క్షేత్రానికి దూరంగా ఉండే గ్రామాల్లో అంత్యక్రియలు చేసుకునేందుకు కూడా దేవస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మల్లమ్మ కన్నీరు డంపింగ్ యార్డు వద్ద 50 సెంట్ల స్థలాన్ని ప్రత్యేకంగా స్మశానవాటికకు కేటాయించి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.స్వామిఅమ్మవార్ల దర్శనార్థం కాలినడకన వస్తూ మార్గమధ్యలో శివైక్యం చెందిన వారి బంధుమిత్రులకు సమాచారం అందించి వారి స్వస్థలాలకు మృతదేహాన్ని ఉచితంగా చేరవేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా శివ సన్నిధిలో ప్రాణాలు కోల్పోతున్న సాధువులు, యాచకులు, అనాధుల మృతదేహాల అంతిమయాత్రను దేవస్థానం బాధ్యతా హిందూ సాంప్రదాయం ప్రకారం పురోహితులచే అంతిమ సంస్కారాలన్నీ శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో ఆజాద్ తెలిపారు. ఇలాంటి మహాత్కార్యాన్ని తలపెట్టిన దేవస్థానం వారికి ధన, వస్తు రూపేణ విరాళాలు ఇచ్చేందుకు దాతలు నేరుగా ఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరుబాట.. కార్యాచరణ ప్రకటించిన వైఎస్ జగన్



విజయవాడ, డిసెంబర్ 4, ఏపీలో పాలనపై అందరూ అసంతృప్తితో ఉన్నారని.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందంటూ కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు సంధించారు.. బుధవారం తాడేపల్లిలోని తన కార్యాయలంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రదాన కార్యదర్శులు, రీజినల్ కోఆర్డినేటర్లతో వైసీపీ చీఫ్ జగన్ సమావేశం అయ్యారు.సూపర్-6 హామీలు అమలు చేయలేదు.. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత విపరీతంగా ఉందని పోరుబాటకు సిద్ధమవ్వాలని వైసీపీ పార్టీ శ్రేణులకు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.. ఏపీలో పాలనపై అందరూ అసంతృప్తితో ఉన్నారని.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందంటూ కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు సంధించారు.. బుధవారం తాడేపల్లిలోని తన కార్యాయలంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రదాన కార్యదర్శులు, రీజినల్ కోఆర్డినేటర్లతో వైసీపీ చీఫ్ జగన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో హామీలు అమలు చేయలేదని.. విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజల తరపున గళం విప్పాల్సిన సమయం వచ్చిందంటూ పేర్కొన్నారు. వైసీపీ పోరుబాటలో జిల్లా అధ్యక్షులు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# ప్రజల ఆకాంక్షలు తీర్చడమే అసలు సవాల్: ఫడ్నవీస్



ముంబయి : దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర బిజెపి శాసనసభా పక్షం నేతగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విధాన్ భవన్‌లో నిర్వహించిన శాసనసభా పక్షం సమావేశంలో ఫడ్నవీస్ (54) బిజెపి శాసనసభా పక్షం నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బిజెపి కేంద్ర పరిశీలకుడు విజయ్ రూపాని ప్రకటించారు.ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలోనే అసలైన సమస్య ఉందని ఫడ్నవీస్ అన్నారు. తనపై నమ్మకం ఉంచినందుకు ప్రధాని నరేంద్ర మోడీకి కూడా ఫడ్నవీస్ ధన్యవాదాలు తెలిపారు. 'మా బాధ్యత పెరిగింది. మేము మరింత కష్టపడి పని చేయాలి. మా నుంచి ప్రజల ఆకాంక్షలను సాఫల్యం చేయడమే ముందు ఉన్న పోరాటం. దీనిని సాధించేందుకు మా మిత్ర పక్షాలతో కలసి మేము కృషి చేయాలి' అని ఆయన చెప్పారు.భారతీయ జనతా పార్టీ 2019లో ప్రజల తీర్పు సాధించిందని, కానీ 'దానిని లాక్కున్నారు' అని ముఖ్యమంత్రి పదవి గురించి బిజెపితో సంబంధాలను ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన తెంచుకుని, కాంగ్రెస్, అవిభాజ్య ఎన్‌సిపితో పొత్తుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రస్తావిస్తూ ఫడ్నవీస్ పేర్కొన్నారు. 'మొదటి రెండున్నర సంవత్సరాలు మేము ప్రతిపక్షం లక్ష్యానికి గురయ్యాం, కానీ ఒక్క ఎంఎల్ఎ కూడా మమ్మల్ని వదలి వెళ్లలేదు. మేము 2022లో అధికారంలోకి వచ్చాం, ఇప్పుడు, మేము ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం' అని ఫడ్నవీస్ తెలిపారు.

## శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణకు భక్తుల విరాళం.

విభారే న్యూస్ డిసెంబర్ 04 శ్రీశైలం..శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవార్ల దేవస్థానంలో ప్రతినిత్యం జరిగే శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం గా రూ. 1,00,116 /-లను చల్లా శ్రీనివాసరావు, పిడుగురాళ్ళ,పల్నాడు జిల్లా వారు అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు,శేషవస్త్రం అందజేయబడ్డాయి.



# సంపాదకీయం

గురువారం 05-12-2024

## సంక్రాంతికి మాజీల ముహూర్తం

సంక్రాంతి వస్తున్నాం ‘ అనేది మన తెలుగు సినిమాల పోస్టర్ల పై కనిపించే మాట. అయితే ఇప్పుడు అది మన తెలుగు రాష్ట్రాల పాలిటిక్స్ కు కూడా యాప్ట్ గా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విపక్ష నేతలు కేసీఆర్, జగన్ లు సంక్రాంతి నుండి జనం బాట పట్టనున్నారు. అధికార పార్టీల తప్పులను ఎండ గడుతూ సమస్యలపై పోరాడుతాం అంటున్నారు. దీనితో పొలిటికల్ గా రెండు తెలుగు రాష్ట్రాల నేతలు సంక్రాంతి వైపు చూస్తున్నారు.సంక్రాంతి పండుగ ఎటు చూసిన సందడి వాతావరణం ఉంటుంది. గ్రామాలకు కొత్త శోభ వస్తుంది. అక్కడక్కడా కోళ్లపందేలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఇలా సంక్రాంతి హంగామా మనకు కనిపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఇది ఇలా ఉంచితే ఏపీ, తెలంగాణలో పొలిటికల్ సందడి కూడా సంక్రాంతి నుండే ప్రారంభం కానుంది. రెండు చోట్ల రెండు ప్రధాన పార్టీల నాయకులు సంక్రాంతి నుండి గడపగడపకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఏపీలో ప్రతిపక్ష హోదా లేకున్నా, ఆ స్థాయి పార్టీ ఉన్నది మాత్రం వైసీపీనే. అలాగే తెలంగాణలో ప్రతిపక్ష హోదా కలిగి నిరంతరం అధికార పార్టీపై విమర్శలు సాగిస్తున్న పార్టీ బీఆర్ఎస్. ఈ రెండు పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో ఒకరినొకరు ఆత్మీయంగా మెలిగారన్న విషయం బహిర్గతమే. అయితే ఏపీలో మాత్రం వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎన్నికల ఫలితాలలో కేవలం 11 సీట్లకే పరిమితం కావడంతో, మాజీ సీఎం జగన్ ఎదురుదెబ్బ తగిలిందని చెప్పవచ్చు.తెలంగాణలో అయితే పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని గద్దెదించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు ప్రజలు. ఇక్కడ కూడా బీఆర్ఎస్ పార్టీ నుండి పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్ దారి పట్టారు. రెండు చోట్ల ఈ పార్టీల పరిస్థితి ప్రస్తుతం క్యాడర్ ను కాపాడుకొనే స్థితి ఉందని చెప్పవచ్చు. అందుకే కాబోలు ఏపీలో వైసీపీ అద్యక్షుడు జగన్, తెలంగాణలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఇద్దరూ ఇక ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అసలే జమిలీ ఎన్నికల ప్రచారం సాగుతున్న వేళ, ఎన్నికల వరకు ఆగకుండా నిరంతరం ప్రజల్లోకి ఉండాలన్నది వీరి ప్లాన్.అలా ప్రజల్లోకి వచ్చేందుకు సంక్రాంతి పండుగ రోజు వీరిద్దరూ, ముహూర్తం ఖరారు చేసుకున్నారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే జగన్ తాను జిల్లాల పర్యటనకు వస్తానని ప్రకటించగా, కేసీఆర్ కూడా అదే తరహాలో ప్రణాళిక రూపొందిస్తున్నారట. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై ఉన్న ప్రధాన విమర్శ ఆయన ప్రజల్లోకి రారని. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ప్రజలతో కలిసే ప్రయత్నం చేయలేదని అందుకే ఓటమిపాలయ్యారు అనేది ఒక విశ్లేషణ. ఈ మాట బయటి వాళ్ళ నుండే కాదు పార్టీలోనూ అంతర్గతంగా వినిపిస్తుండడంతో ఆయన సంక్రాంతి నుంచి ప్రజల్లోకి రాబోతున్నారు. ఇప్పటికే తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయ్యింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు ప్రజామోదం పొందితే కొన్ని మాత్రం వివాదాస్పదమయ్యాయి. దానితో వాటిని బేస్ చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలనేది కేసీఆర్ ఆలోచన. పైపెచ్చు తెలంగాణలో విపక్షంగా ఃఖీా బలంగానే ఉందిగతంలో జాతీయ రాజకీయాలంటూ కేసీఆర్ చేసిన ప్రయోగం విఫలం కావడంతో కొంతకాలం పాటు రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యే ఆలోచనలో కేసీఆర్ ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడుగా కెసిఆర్ పై అక్కడి ప్రజల్లో ఇమేజ్ ఇప్పటికీ బలంగానే ఉంది. ఒక్కసారి కేసీఆర్ బయటకు వస్తే క్యాడర్, నాయకులు పూర్తిస్థాయిలో యాక్టివ్ అయిపోతారు. తెలంగాణ రాజకీయాల్లో కెసిఆర్ వర్సెస్ రేవంత్ ఎప్పుడూ సంచలనమే. ఏడాదికాలంగా కొంత ఇనాక్టివ్ గా ఉన్న కేసీఆర్ సంక్రాంతి నుండి ప్రజలతో మమేకమై మరోసారి తన ఫైర్ చూపించే ప్రయత్నంలో ఉన్నారు.కెసిఆర్ తో పోల్చుకుంటే ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరింత కష్టాల్లో ఉన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడం మాట అటుంచి ఏకంగా 151 నుండి 11సీట్లకు పరిమితం అయిపోయింది వైసిపి. ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదంటూ అటు అసెంబ్లీకి జగనూ వెళ్లడం లేదు.. పార్టీ ఎమ్మెల్యేలనూ పంపడం లేదు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి నుండి పురంధ్రీశ్వరి గత జగన్ పాలనలో తప్పులను ఎండగడుతూ వస్తున్నారు. మరోవైపు చెల్లెలు షర్మిల ఉండనే ఉంది. మాత్రం ఛాన్స్ దొరికినా జగన్ పై ప్రశ్నలతో విరుచుకుపడుతోంది ఆమె. వీటికి తాడేపల్లి నుండి వీడియోల ద్వారా సమాధానాలు ఇవ్వడమే గాని డైరెక్ట్ గా ప్రజలతో మమేకమయ్యే పని ఇంతవరకు చేయలేదు జగన్.అటు వైసీపీ, ఇటు బీఆర్ఎస్ పార్టీల అధినాయకులు జిల్లాల పర్యటనకు వస్తుండగా నాయకులు అందుకు తగ్గ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారట. సంక్రాంతికి గ్రామాల్లో సందడి ఉంటే, వీరి పర్యటనలతో పొలిటికల్ సందడి కూడా స్టార్ట్ కాబోతోంది. ఏదిఏమైనా రాష్ట్రాలు వేరైనప్పటికీ వీరిద్దరూ మాజీ సీఎంలు కావడం, పార్టీల అధ్యక్షులు కూడా కాగా మరి వీరి పర్యటనల ఎఫెక్ట్ ఏమేరకు ఉంటుందో వేచిచూడాలి.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

---జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 04-గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ప్రాథమిక ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈనెల 6 నుండి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం సీసీఎల్ఏ కార్యాలయం నుండి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా రెవెన్యూ సదస్సులపై అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూవివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈనెల 6 నుండి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈనెల ఆరవ తేదీ నుండి జనవరి 8వ తారీకు వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ మేరకు సెక్షన్ 22ం భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి బాధిత రైతులు రెవెన్యూ సదస్సులలో పాల్గొని అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, మండలంలో జిల్లాస్థాయి అధికారి నోడల్ ఆఫీసర్లుగా రెవెన్యూ సదస్సులలో పాల్గొంటారన్నారు. జిల్లా కలెక్టర్, జెసిలు ప్రతి నియోజకవర్గంలో జరిగే రెవెన్యూ సదస్సులకు హాజరవుతామన్నారు. రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ సమన్వయకర్తగా ఉంటారని కలెక్టర్ తెలిపారు.

## కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వేగవంతం చేయండి

న్యాయశాఖ కార్యదర్శితో మంత్రి ఫరూక్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 04-కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ విభాగం( లీగల్, లెజిస్లేటివ్ అఫైర్స్, జస్టిస్ ) కార్యదర్శిగా జి ప్రతిభా దేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఫ్యామిలీ కోర్టు, నాలుగవ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి గా పనిచేస్తున్న ప్రతిభా దేవిని గత నెల 22వ తేదీన రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శి గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం జరిగింది. రెండేళ్ల పాటు డిప్యూటేషన్ పై ప్రతిభా దేవి న్యాయశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా న్యాయ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ సిహెచ్ శ్రీధర్ లతో మంత్రి ఫరూక్ న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోడమే కాకుండా, శాసనసభ,శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని పేర్కొన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంపై పకడ్బందీగా కార్యాచరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం కర్నూలు ను న్యాయ రాజధాని అంటూ ప్రజలను మభ్యపెట్టడం జరిగిందని అన్నారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో న్యాయపరమైన సేవలు సీమ జిల్లాల ప్రజలకు అత్యంత చేరువ కానున్నాయని అన్నారు.మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ సిహెచ్ శ్రీధర్ తో రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు పునర్నిర్మానంపై మంత్రి ఫరూక్ చర్చించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు..

- నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్స్ స్పెక్టర్..

విభారే న్యూస్ ఎమ్మిగనూరు డిసెంబర్ 4..శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ బివి. మదుసుదనరావు పేర్కొన్నారు. బుధవారం గ్రామీణ పోలీస్ స్టేషన్ నూతనంగా రూరల్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ గా బివి. మదుసుదనరావు పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన రూరల్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ విక్రమ్ సింహా బదిలీ పై వెళ్ళారు. అదే స్థానంలో కర్నూలు సిసి హెచ్ విధులు నిర్వహిస్తున్న బివి. మదుసుదనరావు బదిలీ భాగంగా ఎమ్మిగనూరు గ్రామీణ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ గా బదిలీ పై వచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో రూరల్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ మాట్లాడుతూ అక్రమ కార్యకలాపాలకు తావులేండా చర్యలు చేపట్టుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలలో శాంతిభద్రతలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.రోడ్డు ప్రమాదాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



## పంటల సాగుపై అవగాహన అవసరం

--మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 04-: రైతులు తాము సాగు చేసే పంట లను ఆశించే తెగుళ్ల చీడ పీడలు, పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగుండాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు సూచించారు. నంద్యాల మండలంలోని పులిమద్ది. భీమవరం గ్రామాలలో బుధవారం పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు పరుస్తున్న పథకాలు గురించి రైతులకు వివరించారు. మినుము పంటను పరిశీలించి సాగు విధానం, తెగుళు ,, యాజమాన్య పద్ధతులను వివరిం చారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 6వ తేదీ శుక్రవారం శ్రవణా నక్షత్రంను పురస్కరించుకొని శ్రీ శ్రీనివాస కళ్యాణం..



విభారే న్యూస్ డిసెంబర్ 04 ఎమ్మిగనూరు..పట్టణంలోని వెంకటాపురం కాలనీలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు ప్రతి నెల శ్రవణా నక్షత్రమును పురస్కరించుకొని శ్రీ శ్రీనివాస కళ్యాణం సామూహికంగా జరుగుతుంది. అందులో భాగంగానే 06.12.2024 శుక్రవారం సాయంకాలం 6.00 గంటలకు శ్రవణ నక్షత్రం నందు శ్రీనివాస కళ్యాణం చేయడం నిర్వహించారు. కళ్యాణం చేయించదలచిన భక్తులు 200 రూపాయలు చెల్లించి తమ పేరును నమోదు చేయించుకోవలెను.కర్త్రు సేవ 5000రూపాయలు (దంపతులు కూర్చోబెట్టి వారితో కైకర్యాలని చేయించి. కల్యాణ ప్రసాదం ఇవ్వబడును). చెల్లించి తగిన రసీదును పొందవలెను.ఆలయ అర్చకులు మొబైల్ నెంబర్.9052510491.

## మద్యం సేవించి వాహనం నడపడం చట్ట రీత్యా నేరం...

టూటౌన్ సీఐ షేక్ ఇస్మాయిల్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 04- మద్యం సేవించి వాహనం నడిపితే చట్ట రీత్యా నేరం అని టూటౌన్ సీఐ షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. బుధవారం సీఐ షేక్ ఇస్మాయిల్ ఒ ప్రకటన లో మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ వద్ద మా సిబ్బంది తో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం సేవించి ఉండి రోడ్డుపైన వాహనాలు నడుపుతూ పట్టు పడిన పి. నర్సింహులు ను విచారించి స్వాధీనంలోనికి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టు కు ఆదరుపరచగా , సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్ .రామభూపాల్ రెడ్డి గారు ముద్దాయి కీ 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసారని తెలిపారు. . మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరం. మద్యం సేవించి వాహనం నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి మరణించే అవకాశం ఉంది. కావున మీరు ప్రమాదంలో పడటమేకాకుండా ఇతరులను కూడా ప్రమాదంలో పడవేసే అవకాశం ఉంటుంది. కావున మద్యం సేవించి వాహనం నడపరాదని విజ్ఞప్తి చేశారు.



# కాకినాడ పోర్టుపై గట్టిగా నిఘా

కాకినాడ, డిసెంబర్4, సీజ్ ది షిప్ ట్రెండింగ్ టాపిక్ అయింది. కాకినాడ పోర్టు పరిశీలనలో భాగంగా సీజ్ ది షిప్ అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు ట్రెండింగ్‌గా మారాయి. అయితే పవన్ చెప్పినంత ఈజీగా షిప్‌ను సీజ్ చేయడం సాధ్యం కాదని, అంతర్జాతీయంగా ఈ ప్రభావం ఉంటుందన్న చర్చ జరిగింది. అయితే షిప్‌ను ఆపే అధికారం కస్టమ్స్ అధికారులకు ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ స్టేట్‌మెంట్ ఇచ్చే వరకే పవన్ కామెంట్ మీద రాజకీయ రచ్చ కంటిన్యూ అయింది. పవన్ టూర్ మీద వైసీపీ సెటైర్లు వేస్తోంది. రేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలుతున్నది నిజమని.. దాన్ని అరికట్టడంలో విఫలమైనట్లు ఒప్పుకున్నారని విమర్శిస్తోంది. రేషన్ బియ్యం తరలింపు జాతీయస్థాయి కుంభకోణమంటున్నారు ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల. సీబీఐతో విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.చంద్రబాబుతో పవన్ భేటీ..తర్వాత మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు చర్చలతో..కాకినాడ పోర్టుపై నిఘా పటిష్టం చేయబోతున్నారు.ఓ సీనియర్ ఐపీఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ సెక్యూరిటీ టీమ్‌ను పెట్టి.. అడుగు తీసి అడుగు వేయాలంటే కూడా పోలీస్ కనుసన్నుల్లోనే జరిగేలా పావులు కదుపుతోందట. షిప్ సీజ్..అధికారుల వైఫల్యం..ఈ హడావుడి కంటే పోర్టు మీదే ఓ కన్నేసి పెడితే..అందరి లెక్కలు తేలుతాయని భావిస్తున్నారట. ప్రత్యేక భద్రతా అధికారి పర్యవేక్షణలో నిఘా పెడితే..కాకినాడ పోర్టులో జరుగుతోన్న దందా అంతా బయటికి వస్తోందని అనుకుంటుంటోందట.ప్రత్యేక భద్రతా వ్యవస్థ..డేడికేటెడ్‌గా పోర్టులోనే ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. లోకల్ పోలీస్‌లు వెళ్లి పర్యవేక్షణ పెట్టడం కంటే.. ఓ స్పెషల్ టీమ్ 24 హవర్స్ పోర్టులోనే విధులు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారట. అలా పోర్టులో ఏం జరిగిన వెంట వెంటనే తెలిసిపోయేలా.. ప్రతీ అక్రమ దందాకు అక్కడే చెక్ పెట్టేలా పకడ్బందీ వ్యూహం రెడీ చేస్తున్నారట.ఇప్పటికే బియ్యం లోడ్‌తో పట్టుబడిన షిప్ సీజ్ తమ అధీనంలోనే ఉందని కలెక్టర్ షన్మోహన్ ప్రకటించారు. రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లై..పోర్ట్, కస్టమ్స్ అధికారులతో టీమ్ ఏర్పాటు చేసి..రెండు రోజులు ప్రత్యేక టీమ్‌లతో క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. ఎక్కడెక్కడి నుంచి బియ్యం పోర్టుకు చేరుతున్నాయో..లింకులు ఏంటో బయటికి తీసేందుకు రెడీ అవుతున్నారు.రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపే విషయంలో తగ్గేదేలే అంటోంది ఏపీ సర్కార్. కాకినాడ పోర్టులో భద్రతను పటిష్టం చేయాలని డిసైడ్ చేసింది. రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టులో వ్యవహారాలపై మంత్రులు జరిపిన సమీక్షలో కీలక విషయాలు తెలిశాయట. కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు చాలామంది రైస్ మాఫియాకు సహకరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు.అధికారుల సహకారం వల్లే గ్రామీణ స్థాయి నుంచి పోర్టు వరకు బియ్యం సరఫరా జరుగుతుందని ఆరా తీసినట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం విదేశీ ఎగుమతులకు అడ్డాగా తయారైన కాకినాడ పోర్టులోనే..బియ్యం రీసైక్లింగ్ కూడా జరుగుతుందట. పోర్టులోని గోదాములను లీజుకు తీసుకుని రేషన్ బియ్యాన్ని నూకలు చేయడం, పాలిష్ పట్టి సిల్కీ రైస్‌గా మార్చడానికి యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారట. దీంతో పోర్టుపై పోలీస్ నిఘాను ఇంకా పటిష్టం చేసి..బియ్యం అక్రమ రవానా జరిగే ఏరియాల్లో అనుభవమున్న అధికారులను నియమించి..ఉక్కుపాదం మోపాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు.కాకినాడ పోర్టు భద్రతలో భాగంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఊూను నియమిస్తారట. ఆయన ఆధ్వర్యంలోనే పోర్టు పరిసర ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయనున్నారు. షిప్పుల వారిగా అధికారులు..అవసరమైతే సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోర్టును తమ అధీనంలోకి తీసుకుంటే రేషన్ బియ్యం మాఫియాను చావు దెబ్బ కొట్టొచ్చని భావిస్తున్నారు. అలా విదేశాలకు బియ్యం ఎగుమతికి అడ్డాగా ఉన్న కాకినాడ పోర్టునే పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుంటే రైస్ మాఫియా ఆగడాలను అడ్డుకోవచ్చని ప్లాన్ చేస్తున్నారట.సీజ్ ది షిప్ అంటూ పవన్ చేసిన కామెంట్స్ నుంచి స్పెషల్ సెక్యూరిటీ టీమ్ ఏర్పాటు వరకు కాకినాడ పోర్టుపై అప్డేట్స్ వస్తూనే ఉన్నాయి. ఫైనల్‌గా గ్రామీణ స్థాయి నుంచే రేషన్ బియ్యం దందాకు చెక్ పెట్టడంతో పాటు..పోర్టును పూర్తిగా ప్రక్షాళన చేయాలని కూటమి సర్కార్ డిసైడ్ అయిందట. ద్విముఖ వ్యూహంతో రేషన్ రైస్ స్మగ్లింగ్‌కు ఎండ్ కార్డ్ వేయాలని ఫిక్స్ అయిందంటున్నారు.త్వరలోనే మరిన్ని చర్యలు ఉంటాయని.. తన, మన అని తేడా లేకుండా..రేషన్ బియ్యం మాఫియా విషయంలో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చాలా సీరియస్‌గా ఉన్నారని అంటున్నారు కూటమి నేతలు. వైసీపీ విమర్శలు తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం తప్ప వాస్తవాలను మాత్రం ఒప్పుకోవడం లేదని రివర్స్ అటాక్ చేస్తున్నారు. చూడాలి

# విజయనగరం రాజులకు గవర్నర్ గిరీ... ?

విజయనగరం, డిసెంబర్4, పూసపాటి అశోక్ గజపతిరాజు.. రాష్ట్ర మాజీ మంత్రిగా , కేంద్ర మాజీ మంత్రిగా పనిచేసిన ఆయన పేరు రాష్ట్ర రాజకీయాల్లో తెలియని వారుండరు. రాజకీయాల్లో అవినీతి ఆరోపణలు లేని నాయకుడు.. టీడీపీ లాంటి 40 ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీలో గత ఎన్నికల వరకు ఆయనే నంబర్ 2 గా కొనసాగారు. ఎన్టీఆర్ హయాంలోనూ.. తర్వాత చంద్రబాబు దగ్గర ఆయన మాట అంతలా చలామణి అయ్యేది. రాజకీయాల్లో అవినీతి మచ్చలేని నాయకులలో ముందు వరుసలో ఉండే పేరు అశోక్ గజపతిది.ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలన్నదే ఆయన ప్రాథమిక సూత్రం. మొన్నటి ఎన్నికల నుండి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ అశోక్ గజపతి గురించి చర్చ జరగని రోజు లేదంటే అతిశయోక్తి కాదు . రాజు గారికి రాజ్యసభ ఇస్తారంట కదా.. రాజుగారిని రాజ్యసభకి పంపించి కేంద్ర మంత్రిని చేస్తారంట కదా అనే చర్చ జరుగుతూనే ఉంది. రాజ్యసభ , కేంద్ర మంత్రి చర్చ నుండి ఇపుడు మరో చర్చ తెరమీదకి వచ్చింది.రాజు గారి నిజాయితీకి , ఆయన మేధస్సుకి గవర్నర్ గిరే సరైందనే అభిప్రాయం వ్యక్తమవుతోందట . ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఉన్న సాన్నిహిత్యంతో రాజుని అందలం ఎక్కించాలనే ఆలోచనలో ఉన్నారట . ప్రత్యక్ష రాజకీయాలనుండి తప్పుకున్నారు కాబట్టి గవర్నర్ అయితేనే ఆయనకి సరైన గౌరవం అని భావిస్తున్నారట . దానికి రాజ్యాంగంపై అశోక్ గజపతికి ఉండే గౌరవం కూడా ఒక కారణం అయిఉండవచ్చని అంటున్నారు. అలాంటి వ్యక్తే ఆపదవికి అర్హుడు అన్న చర్చ కూడా జరుగుతోందట.మరో పక్క ఈ పదవికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేరు కూడా వినిపిస్తున్నప్పటికీ చంద్రబాబు, ఇతర సీనియర్లు, బీజేపీ నాయకులు సైతం అశోక్ వైపే మొగ్గు చూపుతున్నారట . మొదటి నుండి చంద్రబాబుకి రాజకీయాల్లో అశోక్ గజపతి అత్యంత సన్నిహితుడు .. వైశ్రాయ్ ఘటన నుండి చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం వరకు అశోక్‌గజపతి కూడా కీలక సూత్రధారే. అయినప్పటికీ ఏనాడూ నాకీ పదవి కావాలని , ఫలానా వాడికి ఫలానా పదవి ఇవ్వండి అని ఆయన అడగలేదన్న గౌరవం చంద్రబాబుకి ఉందంట.ముచ్చటగా మూడో సారీ మోడీ ప్రభుత్వం కేంద్రంలో కొలువుదీరడంలో టీడీపీ కీలక పాత్ర పోషించింది . అందుకు కృతజ్ఞతగా టీడీపీకి ఒక గవర్నర్ పోస్టు కేటాయించాలని యోచిస్తోందట మోడీ సర్కార్ .. కేంద్ర మంత్రిగా పనిచేసిన అశోక్‌గజపతి రాజంటే మోడీకి కూడా ఎంతో గౌరవం. అందుకే అశోక్ గజపతి పేరు ప్రతిపాదిస్తే కేంద్ర పెద్దల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని చంద్రబాబు భావిస్తున్నారంట. గత ఎన్నికల్లో విజయనగరం ఎంపిగా పోటీ చేయాలని పార్టీ ఒత్తిడి తెచ్చినా .. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని , తమ వయసుకి ఇక రాజకీయాలు సరైనవి కావని నిర్మొహమాటంగా చెప్పేశారు అశోక్ గజపతి . ఇప్పటికీ ఆయన కోరుకుంటే కేంద్రమంత్రి పదవి పెద్ద విషయం కాదంటారు.కానీ ఆయన ఏనాడూ పదవులకోసం వెంపర్లాడలేధు . పార్టీ లైన్ కూడా దాటలేధు . పార్టీ నిర్ణయం ఆయనకి శిరోధార్యం . ఆయన కుమార్తె అదితి ఎమ్మెల్యే అయినప్పటికీ ఆమె వ్యవహారాలలో ఇప్పటికీ తలదూర్చరు. అడిగితే సలహాలు ఇవ్వడం మాత్రమే ఆయనకి తెలుసు . తన కుమార్తె రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఆయన చెప్పిన మాటలు ఆయన మనస్తత్వానికి అద్దం పడతాయి. రాజకీయాలు అంటే చెత్త బుట్ట లాంటివని, అందులో కోతి గెంతులు వేస్తే ఆ చెత్త ఊరంతా పాకుతుందని వ్యాఖ్యానించారాయన. ఇలాంటి నేచర్ ఉండబట్టే ఇప్పటికీ గెలుపోటములతో సంబంధం లేకుండా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారనడంలో సందేహం లేదు.అదలా ఉంటే మరో చర్చ కూడా ఉంది . అశోక్ కి ఇప్పటికే టీటీడీ ఛైర్మన్ ఆఫర్ వచ్చిందని ఆయనే వద్దనుకున్నారనే ప్రచారం ఉంది . మానసాస్ ట్రస్ట్ కి ఛైర్మన్ గా ఉండడం , అందులో 108 దేవాలయాలకు అనువంశిక ధర్మకర్తగా ఉండడంతో ఆయన టీటీడీ పదవిని వద్దన్నారట . మరి ఇపుడు అదే రీజన్ తో ఒకవేళ నిజంగా గవర్నర్ పదవి ఆఫర్ వస్తే నో అంటారో లేక ఎస్ అంటారో అన్న చర్చ జరుగుతుంది.

# బెజవాడ లోమెట్రో సాధ్యమేనా

విజయవాడ, డిసెంబర్ 4, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు నిర్మాణాన పనులకు ఆమోదం తెలిపింది. పదకొండు వేల కోట్ల రూపాయలతో తొలిదశ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. విశాఖపట్నం నగరం కాస్మోపాలిటన్ సిటీ. అక్కడ ట్రాఫిక్ కూడా ఎక్కువే. విశాఖ నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రజల నుంచి ఆదరణ లభించే అవకాశాలున్నాయి. జనాభా పరంగా, వచ్చిపోయే టూరిస్ట్ ల సంఖ్య ఆధారంగా అక్కడ మెట్రో రైలు సక్సెస్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ విజయవాడలో మాత్రం మెట్రో రైలు ప్రాజెక్టు సక్సెస్ అవుతుందా? లేదా? అన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. హైదరాబాద్ నగరంలోనే మెట్రో రైలుకు ఆక్యుపెన్సీ రేటు తక్కువగా ఉందని ఎల్ అండ్ టీ సంస్థ చెబుతుంది. హైదరాబాద్ నగరంలో కోటి మంది జనాభా ఉన్నారు. రోజూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో హైదరాబాద్ లో మెట్రో రైలు అవసరం అని గుర్తించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొంత వరకూ సక్సెస్ అయిందనే చెప్పాలి. అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఐటీ కంపెనీలు కూడా ఇక్కడ ఉండటంతో ఎక్కువ రద్దీ ఉంటుంది. అయినా మెట్రో రైలు ప్రాజెక్టు హైదరాబాద్ లో ఆశించినంత సక్సెస్ కాలేదని ఆ సంస్థ యాజమాన్యం చెబుతుంది. బెంగళూరు నగరంలోనూ మెట్రో రైలు ప్రాజెక్టు సక్సెస్ అయింది. విశాఖ టూరిజం ప్లేస్ కావడంతో... విశాఖపట్నంలోనూ పలు దశల్లో మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. విశాఖలో ఎక్కువ మంది జనాభా ఉన్నారు. ఎక్కువగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో పాటు కొన్ని ఐటీ కంపెనీలు కూడా ఉండటం, వ్యాపారానికి కేంద్రంగా ఉండటంతో విశాఖలో మెట్రో రైలు సక్సెస్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖపట్నంలో మూడు కారిడార్లలో మెట్రోరైలు ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. విశాఖ వాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. విశాఖ నగరంలో నెలకొన్న ట్రాఫిక్ కు చెక్ పడుతుందని స్థానికులు కూడా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడు కారిడార్లలో మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. మొత్తం 76.9 కిలోమీటర్ల మెట్రో రైలు ప్రాజెక్టుకు మొదటి దశలో ప్రభుత్వం ఒకే చెప్పింది. విజయవాడలో మాత్రం ఒకింత అనుమానంగానే కనిపిస్తుంది. ఎందుకంటే విజయవాడ నగరం అతి పెద్ద పల్లెటూరుగా పిలుస్తారు. దీంతో పాటు రాజధాని అమరాతి నిర్మాణం పూర్తవ్వడానికి ఎన్నేళ్లు సమయం పడుతుందో తెలియదు. సందర్శకుల సంఖ్య కూడా రోజుకు విజయవాడలో తక్కువగానే ఉంటుంది. ఎటు వెళ్లినా విజయవాడలో పది కిలోమీటర్ల దూరం మాత్రమే కావడంతో ఎక్కువ మంది సొంత వాహనాలపైనే ఆధారపడతారు. బిజినెస్ పరంగా చిన్న చిన్న వ్యాపారులు విజయవాడకు తరచూ వస్తుంటారు తప్పించి టూరిజం కేంద్రంగా మాత్రం చూడరు. అందుకే ఇక్కడ మెట్రో రైలు ఎంత మేరకు సక్సెస్ అవుతుందన్నది మాత్రం సందేహంగానే కనిపిస్తుంది. గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరూ, పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి, పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మూడు కారిడార్లలో మెట్రో రైలు నిర్మాణం చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తొలి దశకు సంబంధించి 1,152 కోట్ల రూపాయలతో భూసేకరణ చేయగా, మొత్తం 11,009 కోట్ల రూపాయల వ్యయంతో మెట్రో రైలు నిర్మాణం చేపట్టనున్నారు. మరి సక్సెస్ అవుతుందా? లేదా? చూడాల్సి ఉంది.

# రఘురామ కేసులో ఏం జరుగుతోంది

గుంటూరు, డిసెంబర్ 4, తెలంగాణా ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులైన పోలీసు అధికారుల తరహాలోనే ఎపిలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న పోలీసు అధికారులు విదేశాలకు పారిపోవాలని చూస్తున్నారా? డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అందుకే ఆరోపణలు గుప్పిస్తున్నారా? మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్ సునీల్ కుమార్ విదేశాలకు పారిపోకుండా చూడాలని ఆర్ఆర్ఆర్ ఫిర్యాదు చేయడం అందుకేనా? కేసుల్లో నిందితులుగా ఉన్న ఐపీఎస్ లు ముందస్తు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసుకుంటున్నారు ముంబై నటి జత్వాని వేధింపుల కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులను ఏపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన వైసీపీ హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. పీఎస్ఆర్ ఆంజనేయులు కేవలం జత్వానినే కాదని.. ఎంతోమంది మహిళలను వేధించారని, తన మాట వినకపోతే ఎన్నో ఇబ్బందులు పెట్టేవారన్న ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఆయనను ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించింది. తన ఉద్యోగాన్ని అడ్డుగా పెట్టుకుని ఆ అధికారి సాగించిన చీకటి బాగోతాలు ప్రభుత్వం మారాక బయటకు వస్తున్నాయి. అయినా ఆయనపై ఇప్పటి వరకు చర్యలు లేవఇక మరో ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్.. ఆంధ్రప్రదేశ్ లో మాజీ ఎంపీ, ప్రస్తుత డెప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు కేసు సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే రఘురామ కృష్ణ రాజుపై చేయి చేసుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐడీ మాజీ అధికారి విజయ్ పాల్ అరెస్ట్ అయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్ గా ఉన్న సునీల్ కుమార్ పై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన విదేశాలకు పారిపోకుండా చూడాలని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు తాజాగా పోలీసులను కోరారు.రఘురామ కృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే సీఐడీ అదనపు మాజీ ఎస్పీ విజయ్ పాల్‌ను అరెస్ట్ చేశారు. మరికొంతమందిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కస్టోడియల్ టార్చర్ కేసు దర్యాప్తులో వేగం పుంజుకుందని.. న్యాయం ఎప్పుడు జరుగుతుందన్నది తెలియాల్సి ఉందని ఆర్ఆర్ఆర్ అంటున్నారు.కస్టోడియల్ టార్చర్ కేసులో 5వ నిందితురాలు డాక్టర్ ప్రభావతి ఇప్పుడు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభావతి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తాను ఇంప్లీడ్ అవుతానని ఆర్ఆర్ఆర్ ప్రకటించారు. కస్టడీలో తనను బాగానే చూసుకున్నారని ఇద్దరు వీఆర్వోల సమక్షంలో.. తాను స్టేట్మెంట్ ఇచ్చినట్లుగా తప్పుడు లెటర్ సృష్టించారని ఆయన మండిపడ్డారు.ఆ క్రమంలో ఏపీ సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ విదేశాలకు పారిపోకుండా చూడాలని పోలీసులను రఘురామకృష్ణంరాజు కోరారు. విధినిర్వాహణలో ఉన్నప్పుడే విదేశాలకు వెళ్లి ఉల్లాసంగా? ఉత్సాహంగా గోల్ఫ్ ఆడిన ఘనుడని ఎద్దేవా చేశారు. ఆయనకు దుబాయ్‌లో వ్యాపారాలున్నాయని ఆరోపించారు. పీవీ సునీల్ కుమార్ తన ఇంట్లో పని చేసే వాళ్లు, సొంత మనుషులతో తనను తుద ముట్టించాలని చూశారని రఘురామ కృష్ణంరాజు ఆరోపణలు గుప్పిస్తున్నారుఆర్ఆర్ఆర్ కంప్లైంట్‌పై కేసు నమోదైనా ప్రధాన నిందితులు బయటే తిరుగుతున్నారు. పిఎస్ఆర్ ఆంజనేయులు లాంటి అధికారుల కేసుల గురించి అసలు పట్టించుకోని ప్రభుత్వం ఉప సభాపతిగా ఉన్న రఘురామరాజు కేసులో కూడా సీరియస్ యాక్షన్ తీసుకోకపోతుండటం చర్చనీయాంశంగా మారింది. మరి గత ప్రభుత్వంలో అక్రమాలు, దౌర్జన్యాలపై చట్టం తన పని తాను చేసుకుపోతుందంటున్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఐపీఎస్‌ల అరెస్టులో జాప్యంపై ఎలా స్పందిస్తారో చూడాలి.

## జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు, నల్లజాతి సూరీడు, భారతరత్న నెల్సన్ మండేలా

-నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో జరిగిన ఒక మారణకాండకు సంబంధించి 27 సంవత్సరాలపాటు "రోబెన్" అనే ద్వీపంలో జైలు శిక్షను అనుభవించిన మండేలా, 20వ శతాబ్దపు అత్యంత సుప్రసిద్ధులైన ప్రపంచ నాయకులలో ఒకరిగా గుర్తింపు పొందారు. దీంతో ఆయన, జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపే పోరాటాలకు, వర్ణ సమానతకు ఒక సంకేతంలాగా నిలిచారు. జీవిత వివరాలను చూస్తే... నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా, దక్షిణాఫ్రికా దేశ మాజీ అధ్యక్షుడు. కేప్ ప్రాంతంలోని ఉమటా జిల్లా, మవెజో అనే ఊర్లో 1918, జూలై 18వ తేదీన ఈయన జన్మించారు. దక్షిణాఫ్రికాకు పూర్తి స్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడిగా ఈయన కీర్తి గడించారు. అధ్యక్షుడు కాకమునుపు ఇతను జాతి వివక్ష వ్యతిరేఖ ఉద్యమకారుడిగా, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు, దానికి సాయుధ విభాగం అయిన "ఉంకోంటో విసిజ్వే"కు అధ్యక్షుడిగా పనిజేశారు.ఫిబ్రవరి 11, 1990లో జైలునుండి విడుదల అయిన తరువాత నెల్సన్ మండేలా రాజకీయంగా తన లక్ష్యాన్ని సాధించడానికి, దేశంలో నెలకొన్న జాతి వైర్యాన్ని నివారించడానికి, అందరి మధ్య సయోధ్య పెంచడానికి కృషి చేశారు. తన పూర్వపు శత్రువులనుండి కూడా ప్రశంసలు అందుకొన్నారు. వందకు పైగా అవార్డులు, సత్కారాలతో వివిధ దేశాలు, సంస్థలు ఈయనను గౌరవించాయి. వాటిలో 1993లో లభించిన నోబెల్ శాంతి బహుమతి ముఖ్యమైనది. స్వదేశంలో మండేలాను "మదిబా" అని వారి తెగకు సంబంధించిన గౌరవసూచకంతో పిలుస్తుంటారు.జాతిపిత మహాత్మా గాంధీ బోధించిన శాంతియుత విధానాలు, అహింస, శత్రువును సంస్కారయుతంగా ఎదుర్కొనే పద్ధతి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని మండేలా చాలాసార్లు వెల్లడించారు. భారత దేశం కూడా మండేలాను "జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య బహుమతి"తో సత్కరించింది.అలాగే... 1990లో భారత ప్రభుత్వం మండేలాకు మనదేశపు అత్యున్నత పురస్కారం అయిన భారతరత్నను ప్రకటించింది. మన దేశం నుంచి ఆయనకు ఎంతో గౌరవం లభించిందన్న దానికి నిదర్శనంగా అనేక విగ్రహాలు కూడా చాలాచోట్ల నెలకొల్పబడ్డాయి. కొన్ని కూడళ్ళకు, రోడ్లకు మండేలా పేరు పెట్టారు. ఢిల్లీలో కూడా ఆయన పేరుతో ఒక "నెల్సన్ మండేలా రోడ్" ఉంది.అదలా ఉంచితే... 1994లో మండేలా తన 77 సంవత్సరాల వయసులో అధ్యక్ష పదవిని చేబట్టి ఆ పదవిని అలంకరించిన వారిలో అతి పెద్ద వయస్కుడయ్యారు. రెండవసారి మరలా ఎన్నికల్లో పోటీ చేయరాదని నిశ్చయించుకున్న ఆయన, 1999లో పదవీ విరమణ చేశారు. జూలై 2001లో ఆయనకు ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, రేడియేషన్ వైద్యం చేశారు.తన పదవీ విరమణ తరువాత ఎయిడ్స్ వ్యాధి నివారణకు మండేలా విశేషంగా కృషి చేశారు.

# బద్వేల్ లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం దిశగా అడుగులు

## ప్రత్యేక వ్యూహరచనతో ముందుకు సాగుతున్న టిడిపి నేతలు

బద్వేలు,బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి లు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ప్రత్యేక ప్రణాళికతో ఎప్పటికప్పుడు ఆయా మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలతో సమాలోచనలు జరుపుతూ పావులు కదుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి మండలంలో ను, గ్రామాల్లోను దీటుగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా విద్యా కమిటీ చైర్మన్ ల ఎంపికలో తమదైన శైలిలో వ్యూహ రచన గావించారు. రితీష్ రెడ్డి తన తాత వీరారెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని పేద ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వింటూ పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. వైసిపి హయాంలో జరిగిన కబ్జాలను వెలికి తీసే దిశగా చర్యలు చేపడుతూ మరోవైపు తెలుగుదేశం పార్టీకి గౌరవం పెంచేదిశగా కార్యకర్తలు నడవాలంటూ హెచ్చరికలు జారీ చేస్తూనే వస్తున్నారు. ఏ కార్యకర్తకు ఆపద వచ్చిన తాను ముందు ఉంటానంటూ.. చేపడుతున్న చర్యల్లో భాగంగా ఏర్పడుతున్న పలు అపోహలను తుడిచిపెట్టే దిశగా రితీష్ రెడ్డి కార్యాచరణను చేపట్టారు.తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గాను తల్లి విజయమ్మ తో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ గ్రామస్థాయి నుంచి టిడిపిని బలోపేతం చేసే దిశగా సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాకుండా బూతు స్థాయిలో కూడా పార్టీ సభ్యత్వాన్ని పెంపొందించేలా బూత్ కార్యకర్తలతో సమాలోచనలు జరుపుతున్నారు. జిల్లాస్థాయిలో సభ్యత్వ నమోదులో బద్వేలును కూడా ముందువరుసలో ఉండేలా చేస్తూ ..మరోపక్క నీటి సంఘాల చైర్మన్ల ల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరుపుతూ తెలుగుదేశం పార్టీ కార్యాలయం కళకళలాడుతున్నదని పార్టీ అభిమానులు పేర్కొంటున్నారు.కూటమి నాయకులను సైతం కలుపుకొని ముందుకు సాగుతున్న రితీష్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో.. తప్పనిసరిగా తెలుగుదేశం పార్టీ విజయాన్ని సొంతం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు ఇప్పటినుంచే కొనసాగిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు

# పిడుగురాళ్లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

## ముఖ్యఅతిథిగా ఆరి వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల,:భారతీయ జనతా పార్టీ (బిజెపి) సభ్యత్వ నమోదు కార్యక్రమం లో భాగంగా పిడుగురాళ్ల పట్టణం లో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి అత్తాలూరి రాము ఆధ్వర్యంలో సభ్యత్వ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా కన్వీనర్, జిల్లా సభ్యత్వ కో ప్రముఖులు ఆరె వెంకటేశ్వర్లు హాజరైనారు. ఈ సందర్భంగా ఆరె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సమయము వారం రోజులు మాత్రమే ఉన్నది కాబట్టి దాదాపుగా 15 క్రియశిలక సభ్యత్వలు చేయవలసి ఉన్నందున అందరు కలిసి ఈ 15 క్రియాశీలక స్వభ్యత్వలు పూర్తి చేయవలసిందిగా, అదేవిధంగా బూతు కమిటీ అధ్యక్షులను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో గురజాల అసెంబ్లీ కో కన్వీనర్ వడ్లమూడి వెంకయ్య, శ్రీనివాస్ నాయక్, అరుంధతి, అంజమ్మ, మణికంత, హేమంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## రోశయ్య సేవలు మరువలేనివి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్ రెడ్డి



అనంతపురం విబారె న్యూస్ డిసెంబర్ 4 మాజీ గవర్నర్మాజీ ముఖ్యమంత్రి వర్యులు,శ్రీ కొనిజెటి రోషయ్య సేవలు ఏపీ మరియు తెలంగాణ ప్రజలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మరువదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై మధుసూదన్ రెడ్డి తెలిపారు,సందర్భంగా నగరంలోని ఎన్.టి.ఆర్.మార్గ్ వద్ద ఉన్న రోషయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్షులు వై మధుసూదన్ రెడ్డి ఏపీసీసీ ఉపాధ్యక్షలు కోటసత్యనారాయణ పాల్గొన్నారు, వారు మాట్లాడుతూ రోశయ్య కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి గా ఈ రాష్టానికి ఎలాలేని సేవలుఅందించారాని వారి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు శంకర్ యాదవ్, ఎం ఇమామ్ వలి శివారెడ్డి నరసింహారెడ్డి ఎన్ ఎస్ యు ఐ శాంత్ రెడ్డి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘనంగా ప్రారంభం





విభారే న్యూస్ డిసెంబర్ 3 కర్నూల్ ప్రతినిధి.. కర్నూలు లో శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి,బొగ్గుల దస్తగిరి,తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. నగరంలోని బుధవార పేటలో శ్రీబాలాజీ హాస్పిటల్ ను పేద,మద్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలలో నూతనంగా ఏర్పాటు చేశామని డాక్టర్లు తెలిపారు. కర్నూలు లో ఆదునిక వైద్య పరికరాలతో అనుభవం కలిగిన వైద్యులతో హాస్పిటల్స్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ముఖ్య అతిధులు గౌరు చరితారెడ్డి,దస్తగిరి,విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పేదవారికి తక్కువ ధరలకు వైద్యసేవలు అందించాలని వారు వైద్యులను కోరారు. ఈసందర్భంగా శ్రీ బాలాజీ హాస్పిటల్ వైద్యులు నాగరాజు, డాక్టర్. శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీ బాలాజీ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని పట్టణ ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు శ్రీ బాలాజీ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని కోరారు.

### ఎమ్మెల్యే బీవీని కలిసిన రూరల్ నూతన సీఐ..

విభారే న్యూస్ డిసెంబర్ 04 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు రూరల్ నూతన సీఐగా భాద్యతలు చేపట్టిన బీవీ.మధుసుధన్ రావు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సిఐకి సూచించారు. శాంతి భద్రత విషయంలో రాజీపడొద్దని,ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని సూచించారు.



# అపర చాణక్యుడు కొనిజేటి రోశయ్య



మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు

విభారే న్యూస్. డిసెంబర్ 4. కర్నూలుప్రతినిధి అపర చాణక్యుడు కొనిజేటి రోశయ్య ని మాజీ ఎమ్మెల్సీ, మాజీ డిసిసి అధ్యక్షులు యం సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి వర్యులు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య గారి మూడవ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్ బాబు గారు మాట్లాడుతూ రోశయ్య 1933 జూలై 4న జన్మించారని అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, రాష్ట్ర మంత్రిగా, కాంగ్రెస్ ప్రభుత్వాలలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా 15 సార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సునాయాసంగా గట్టెక్కించిన మేధావి రోశయ్యని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు చమత్కారంతో సమాధానాలు చెప్పే వారని, 2009లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రమాదంలో మరణించినప్పుడు ఆపధర్మ ముఖ్యమంత్రిగా పని చేశారని, 2019 సంవత్సరం తమిళనాడు గవర్నర్ గా పనిచేశారని అనంతరం 2021 డిసెంబర్ 4న రోశయ్య మరణించారని ఆయన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో రోశయ్య చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కే వెంకటరెడ్డి, ఐఎన్టియుసి అధ్యక్షులు బి బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఎన్ సుంకన్న, షేక్ ఖాజా హుస్సేన్, యస్ ప్రమీల, కె సత్య నారాయణ గుప్త, కురువ నాగశేషు, బి రామాంజనేయులు, ఖాద్రీ పాషా, యజాస్ అహ్మద్, డబ్ల్యూ సత్య రాజు, సాయి కృష్ణ అబ్దుల్ హై, జాన్ సదానందం, పసుపుల ప్రతాపరెడ్డి, షేక్ మాలిక్, జయకుమార్, అక్బర్, ఐ ఎన్ టి యు సి నాయకులు ఆర్ ప్రతాప్, ఆనందం, ఆశీర్వాదం, అశోక్ మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే..



- ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నాం..
- త్వరలోనే వంద పడకల ఆసుపత్రి ప్రారంభం..

విభారే న్యూస్ డిసెంబర్ 04 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి పరిశీలించారు. ముందుగా వైద్యులతో హెచ్ డి సి సమక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన వంద పడకల ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరులో వంద పడకల ఆసుపత్రి అతి త్వరలోనే ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగినప్పుడు క్రిటికల్ కేర్ సెంటర్ వైద్య సదుపాయాలు అందుబాటులో పెడుతున్నట్లు తెలిపారు. అలాగే ట్రామా కేర్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.దీని ద్వారా ఎమర్జెన్సీ వైద్యం అందించేందుకు సులభం అవుతుందన్నారు. ఇందుకు ప్రతిపాదన కూడా పెట్టడం జరిగిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి గురించి శాసనసభల ప్రస్తావించడం జరిగిందని, సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్,వైద్యులు, హెచ్ డిసి కమిటీ సభ్యులు,సంబంధిత అధికారులు,టిడిపి నాయకులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


# మహిళల,బాలబాలికల భద్ర్రత,రక్షణకు సమన్వయంతో పని చేయాలి...




- జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్.

విభారే న్యూస్ డిసెంబర్ 04 కర్నూలు జిల్లా ప్రతినిధి..లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలను ఆవిష్కరణ చేసిన జిల్లా ఎస్పీ.బాల్య వివాహాలు, బాలల బిక్షాటనను పూర్తిగా నిర్మూలించాలి.గుడ్ టచ్,బ్యాడ్ టచ్ ల గురించి బాలికలకు అవగాహన కల్పించాలి.బాల్య దశను ఉన్నతంగా తీర్చిదిద్దాలి. మహిళలు,చిన్న పిల్లల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలి. మహిళల భద్రత,రక్షణకు, బాల్య దశను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ అన్నారు.ఈ సంధర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలులోని చైల్డ్ వేల్ఫేర్ కమిటి,డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఐసిడిఎస్, విద్యా శాఖ, లేబర్ డిపార్ట్మెంట్,అంగన్ వాడీ టీచర్స్,అంగన్ వాడీ వర్కర్స్, కస్తూర్భగాంధీ విద్యాలయ శాఖల సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు.పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలను జిల్లా ఎస్పీ ఆవిష్కరణ చేశారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్ మాట్లాడుతూ ఇటీవల ఒక చైల్డ్ లేబర్ ను రెస్క్యూ చేసిన ఐసిడిఎస్, ఇతర శాఖల వారిని అభినందిస్తున్నామన్నారు.చిన్నపిల్లలు బిక్షాటన చేయడం ఎక్కడ కూడా కనపడకూడదన్నారు. మహిళలు,చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కొందరూ తెలిసి తెలియక యుక్తవయస్సులో ఉన్న యువతి,యువకులు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్ళి పోతున్నారన్నారు. తల్లిదండ్రులు అటువంటి పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. మిస్సింగ్,పోక్సో కేసులు నమోదు అవుతున్నాయన్నారు. అటువంటివి చేయకూడదని బాల, బాలికలకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. అటువంటి విషయాల గురించి సమాచారం అందించాలన్నారు. సమాజాన్ని కాపాడాలన్నారు. చదువుకున్న వారు కూడా కొందరు కుటుంబ కారణాలతో తల్లి, తండ్రులు,క్షణికావేశాలతో హత్యలు,ఆత్మహత్యలకు పాల్పడి పిల్లలను అనాథలు చేస్తున్నారన్నారు.పిల్లల గురించి ఆలోచించాలన్నారు. పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి తెలియజేయాలన్నారు. లైంగిక నేరాల బారిన పడకుండా వారిని రక్షించాలన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పిల్లల పై అఘాయిత్యాలు, బాల్యవివాహాలు, వరకట్నవేధింపులు,లైంగిక వేధింపులను నివారించడానికి పట్టణాలు,మండలాలు, గ్రామాలలో అవగాహన సదస్సులు చేపట్టాలన్నారు.స్వచ్చంధ సంస్థలు, ప్రభుత్వశాఖలు, గ్రామస్థాయి అధికారులు కూడా సహకరించాలన్నారు.మహిళలపై జరుగుతున్న నేరాల నివారణే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. బాలబాలికల రక్షణ, సహాయం కొరకు చైల్డ్ లైన్ 1098 కు గాని,హెల్ప్ లైన్ 181 కు గాని,పోలీసు డయల్ 100 గాని సమాచారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ వేల్ఫేర్ కమిటి చైర్ పర్సన్ ఎస్. జుబేధ బేగం, డిఇఓ శ్యామూల్ పాల్,బాలల సంరక్షణ అధికారి శారద,అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్ మెంట్ అధికారి నీలకంఠేశ్వర్, సిఐలు ప్రసాద్,శివశంకర్, శ్రీమతి విజయలక్ష్మి , ఎన్జీఓలు,ఉన్నారు.

## మార్గశిర మాసం సందర్భంగా గురువారం దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు..



విభారే న్యూస్ డిసెంబర్ 04 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మార్గశిర మాసం సందర్భంగా దత్తాత్రేయునికి 05-12-2024 గురువారం విశేషంగా పూజలు జరుగుతున్నాయి గోపూజ -516దత్త ఫలం -100దత్త తైలాభిషేకం-200అనఘాష్టమి వ్రతం ప్రధానంగా-1116దత్త హోమం ప్రధానంగా-3500 కావున భక్తులు శివ కేశవుల కృపకు పాత్రులు కాగలరు.శ్రీ గురుదత్తజయ గురుదత్త..సంప్రదించవలసిన నెంబర్:-సురేష్ శర్మ - 6361047578దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు: 8896123777

## పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 04--పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి . బుధవారం పట్టణంలో పలు కాలనీల్లో తనిఖీలు చేశారు. అక్కడ జరుగుతున్న శానిటేషన్ పనులను డ్రైనేజీ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారం వేయడం వల్ల మురికి కాలువలు నిండి పోతున్నాయని ఆయన అన్నారు. ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట ఎమ్ ఈ గురప్పయాదవ్. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. ఇన్ స్పెక్టర్లు లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## అండర్ పాస్ రోడ్లకు సహకరించండి

నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 04-నంద్యాల జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం లో కొన్ని గ్రామాలకు వెళ్లేందుకు కేవలం రోడ్డు దాటడానికి 5 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుందని, హైవేలకు సంబంధించి అండర్పాస్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గట్కారీని ఎంపీ శబరి ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించగలర ఆమె కోరారు. నంద్యాల జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం పనుల పురోగతి, భూసేకరణ, రైతుల నష్టపరిహారం సమస్యలు కూడా కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గట్కారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190